ప్రజాశక్తి
శనివారం 19 అక్టోబర్ 2024
5
విజయనగరం



పిటిసి ప్రిన్సిపల్‌గా రామచంద్రరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డి.రామచంద్రరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లాలో అడిషనల్ ఎస్‌పిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో కొత్తగా ఎదుర్కొంటున్న సైబర్‌క్రైం, సోషల్ మీడియా క్రైంపై పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ సందర్భంగా అవుట్‌డోర్ సిబ్బంది ఇచ్చిన గార్డు ఆఫ్ హానర్‌ను ప్రిన్సిపాల్ స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పివి అప్పారావు, డిఎస్‌పిలు సిహెచ్‌వి రామారావు, టి.రమేష్, మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఎఎస్‌ఐలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న రామచంద్రరాజు

ఆగని మృత్యుకేళి

- డయేరియాతో మరొకరు మృతి
- తల్లి చనిపోయిందన్న మనస్తాపంతో మరో వ్యక్తి కన్నుమూత
- అధికారులతో కలెక్టర్ సమీక్ష
- కొండపాలెం తాగునీటి పథకం పరిశీలన

చికిత్స పొందుతున్న వ్యక్తి

ప్రజాశక్తి-గుర్ల

గుర్ల గ్రామంలో గత వారంరోజులుగా విజృంభిస్తున్న డయేరియా బారిన పడి మరో మహిళ పతివాడ సురమ్మ (65) శుక్రవారం మృతి చెందింది. దీంతో ఇప్పటివరకు వ్యాధి బారిన పడి మృతి చెందిన వారి సంఖ్య 8కి చేంది. ఈనేపథ్యంలో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు మంగళవారం మృతి చెందిన కలిశెట్టి సీతమ్మ కుమారుడు కలిశెట్టి రవి (26) మనస్తాపానికి గురై మృతి చెందాడు. గ్రామంలో అతిసార ప్రబలడంతో గురువారం రాత్రి గ్రామస్తులంతా గ్రామదేవతకు శాంతిపూజలు నిర్వహించారు. ఈనేపథ్యంలో రవి మద్యం సేవించి రాత్రంతా గ్రామంలో మేల్కొని ఉన్నాడు. తెల్లవారేసరికి మృత్యువాత పడ్డాడు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఇంకా 17 మంది చికిత్స పొందుతున్నారు. చీపురుపల్లిలో 13 మంది, మిమ్స్‌లో ఒకరు, విజయనగరంలోని కేంద్రాస్పత్రిలో 8 మంది, విశాఖ కెజిహెచ్‌లో ఒకరు చికిత్స పొందుతున్నారు.

గుర్లలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం పర్యటించి రోగులను పరామర్శించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పైప్‌లైన్లను పరిశీలించారు. సెప్టెక్‌ట్యాంకుల నుంచి వచ్చే వ్యర్థాలు కాలువల్లో కలవకుండా చూడాలని, భూగర్భ జలాలు, తాగునీరు ఎక్కడా కలుషితం అవ్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డయేరియా అదుపు చేసేందుకు తీసుకున్న చర్యలు, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, గ్రామంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని చెప్పారు. శుక్రవారం కొత్తగా ఆరు కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. వారికి మెరుగైన చికిత్సను అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సంభవించిన మరణాల్లో కేవలం ఒక్కరు మాత్రమే డయేరియా కారణంగా మరణించారని, మిగిలినవారు ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందారని తెలిపారు. వైద్యారోగ్యం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ శాఖలు సమన్వయంతో పనులు చేస్తున్నారని చెప్పారు. భూగర్భ జలాలు కలుషితం అవ్వడం వల్లే గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలిందని చెప్పారు. గ్రామంలో మొత్తం 277 బోర్లు ఉన్నాయని, అక్కడ కేవలం 15 అడుగుల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉండటం, బోరు నీరు కలుషితం అవ్వడం వల్లే ఈ వ్యాధి సోకిందని వెల్లడించారు. బోరునీటిని వినియోగించకుండా చర్యలు తీసుకున్నామని, గత ఐదు రోజులనుంచీ నాగావళి తాగునీటి పథకం నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని వివరించారు. గ్రామంలో రోజుకు రెండుసార్లు శానిటేషన్ చేస్తున్నామన్నారు. ప్రతీ 20ఇళ్లకు ఒక ఎఎన్ఎంను నియమించామని, వీరు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని, ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేస్తున్నారని చెప్పారు. గ్రామంలోని పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకొనేవరకు వీటిని కొనసాగిస్తామని తెలిపారు.

కొండపాలెం తాగునీటి పథకం పరిశీలన

నెల్లిమర్లలో చంపావతి నదివద్దనున్న కొండపాలెం రక్షిత మంచినీటి పథకాన్ని కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఇన్ ఫిల్టర్ బావులను, నది నీటిని సైతం పరిశీలించారు. క్లోరినేషన్ చేసి సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నదిలో కూడా కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో మెడికల్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కర్రావు, డిపిఒ టి.వెంకటేశ్వర్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.శ్రీనివాస్, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఆర్‌డిఒ బి.సత్యవాణి, తాహశీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపిడిఓ శేషుబాబు, ఎంఇఒ భానుప్రకాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంపావతి నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్



పాడిరైతుల సదస్సులో మాట్లాడుతున్న ఎపి పాడిరైతుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అజయ్‌కుమార్

సహకార రంగంతోనే మేలు

పాడి రైతుల సదస్సులో వక్తలు ● పాల సేకరణ ధర తగ్గింపునకు నిరసనగా రాస్తారోకో

ప్రజాజాశక్తి - జామి

సహకారం రంగంతోనే పాడి రైతులకు మేలు జరుగుతుందని ఎపి పాడి రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అజయ్ కుమార్, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యానారాయణ అన్నారు. విశాఖ డెయిరీ రైతుల నుంచి సేకరిస్తున్న లీటరు పాలకు మూడు రూపాయలు తగ్గించిందని, ఇందుకు నిరసనగా ఈనెల 29న డెయిరీ వద్ద చేపట్టే ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పాల సేకరణ ధర తగ్గింపునకు నిరసనగా తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారీగా రాస్తారోకో చేపట్టారు.

మండల కేంద్రంలోని సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు అధ్యక్షతన పాడిరైతుల జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ...సహకార రంగంలో ఉండవలసిన డెయిరీలన్నీ రాష్ట్రంలో కంపెనీ యాక్ట్‌లోకి వెళ్లడంతో పాడిరైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. . రాష్ట్రంలో సుమారు 40 నుంచి 50 లక్షల మంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవన కొనసాగిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో సహకార రంగంలో ఉంటేనే పాడి రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. గత పదేళ్లలో పాడి రైతులకు ఇవ్వాల్సిన బోనస్ లు, ఇతర ప్రోత్సాహకాలు అందకుండా పోయాయన్నారు. పశువులకు సంబంధించిన డాక్టర్లు, హాస్పటళ్లు, సరియైన మందులు లేకపోవడం ఇన్సూరెన్స్ అవకాశం లేకపోవడంతో పశువులు చనిపోతే మళ్లీ కొనుగోలు చేసే పరిస్థితులు లేక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రాయితీపై విత్తనాలు, ఎరువులు, పశువుల దానా కూడా కనుమరుగయ్యాయని అన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద డెయిరీగా ఉన్న విశాఖ డెయిరీ కూడా ఆస్తులు అన్యాక్రాంతం చేస్తుందని అన్నారు. దీని పై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని విశాఖ డెయిరీ అవినీతిని బయటపెట్టి మొత్తం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో అన్ని జిల్లాలో పాడి రైతుల సదస్సులు ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా పాడి రైతులను ప్రోత్సహించే విధంగా చర్యలకు డిమాండ్ చేశారు. కేరళ, తమిళనాడు మాదిరిగా మన రాష్ట్రంలో కూడా పాలు లీటకుకు పది రూపాయలు బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ మూడు రూపాయలు తగ్గించి రైతులు నట్టేట ముంచే పరిస్థితి తీసుకొచ్చిందని, ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కల్తీ పాలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు మాట్లాడుతూ..పశు సంపద పెంచేందుకు సంతాన ఉత్పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి మంచి గేదెలు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా పాడి రైతులకు పశువులు రుణాలు ఇవ్వాలని, సాగర్ డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగస్తులందరికీ ఉద్యోగ భద్రత కల్పించి వారి కనీస వేతనం ఇవ్వాలని, ఈనెల 29న విశాఖ డెయిరీ వద్ద జరిగే ఆందోళనలో పాడి రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జి. రవికుమార్, టిడిపి నాయకులు బండారు పెదబాబు మాట్లాడారు. సదస్సులో రైతు సంఘం నాయకులు చల్లా జగన్, గోపాలం, జి.అప్పారావు, యం రమణ, రాయవరపు సత్యం, శ్యాం, చలుమూరి వెంకటరావు నారాయణరావు, పైడిపునాయుడుతో పాటు జిల్లాలోని పాడిరైతులు పాల్గొన్నారు.అనంతరం జిల్లా పాల రైతుల సంఘం కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గొంప రామకృష్ణ, అధ్యక్షులుగా లోకవరపు ఆదినారాయణ ఎన్నికయ్యారు.

వర్షాలపై అప్రమత్తం

- గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు
- మండల స్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాట్లాడుతున్న కలెక్టర్

ఈనెల 22 నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, అది ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రభావం చూపే అవకాశం వుందని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీచేస్తున్న దృష్ట్యా అధికారులంతా అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. తుపానులు, భారీవర్షాలు వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని చెప్పారు. జిల్లాలోని తహశీల్దార్‌లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్‌లు, వైద్యాధికారులు, గ్రామీణ నీటిసరఫరా అధికారులతో కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కార్యాలయం నుంచి సమీక్షించారు. రెండు తీరప్రాంత మండలాల పరిధిలోని గ్రామాల్లో తుఫాను షెల్టర్ల పరిస్థితిపై నివేదించాలని చెప్పారు. తుఫాను షెల్టర్లు వినియోగించేందుకు అనువుగా లేకపోతే ఆయా గ్రామాల ప్రజలను తరలించేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించాలన్నారు. కల్వర్టులు, డ్రైనేజీ కాల్వలు, వాగులు వంటి చోట్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పనిచేసే ప్రదేశంలో నివాసం వుంటూ వచ్చే వారంరోజులూ నిరంతరం పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు.

జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ వచ్చే పదిరోజులూ నిరంతరం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీల్లో 15వ ఆర్థికసంఘం నిధులు అందుబాటులో వున్నాయని, వీటిని వినియోగించి డ్రైన్లను పరిశుభ్రం చేయడం, గ్రామం మధ్యలో చెత్త, పెంటకుప్పలు తొలగింపు, వీధుల్లో బ్లీచింగ్ చల్లడం, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ వంటి పనులన్నీ చేపట్టాలన్నారు. డయేరియా వంటి వ్యాధులు ఎక్కడైనా ప్రబలినట్లయితే సహించబోమని స్పష్టంచేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి

విద్యుత్తు భవనం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యుత్తు భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ ట్రూ ఆఫ్ ఛార్జీలు, సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.8200 కోట్లు భారాలు వేయడం దుర్మార్గమని అన్నారు. మరోవైపు స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, వెంటనే విరమించు కోవాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక సంక్షేమాన్ని గాలికి వదిలేసి, విద్యుత్తు భారాలు రూ.8,114కోట్లు వేసిందన్నారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని, లేదంటే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, బి.రమణ, ఆర్.ఆనంద్, హరీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ట్రూ అప్ ఛార్జీల పేరిట ప్రజలపై విద్యుత్తు భారాలు మోపవద్దని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్తు భారాలపై స్థానిక సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరిట 20వేల కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ప్రతిపక్షంలో ఉన్న టిడిపి బాదుడే బాదుడు అనే కార్యక్రమాన్ని నిర్వహించిందని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం విద్యుత్తు బాదుడు ప్రారంభించిందని విమర్శించారు. గతంలో వాడిన విద్యుత్తుకు అప్పట్లో వినియోగ దారులు బిల్లులు చెల్లించినా, తిరిగి కట్టాల్సిందేనంటూ ట్రూ అప్ ఛార్జీల మోతమోగించడం దారుణమన్నారు. వెంటనే వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కనకల రాము, బొత్స నారాయణ, ఎం.సన్యాసిరావు, జె.సత్యారావు, టి.తాత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు భవనం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

రోడ్ల పనులకు కదలిక

- ఎన్‌డిబి పనులకు రూ.50 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లింపు
- మరో రూ.10 కోట్లు ఇతర గ్రాంట్ల ద్వారా విడుదల
- రోడ్ల మరమ్మతులకు రూ.7.64 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖ ఎస్ఇ కాంతిమతి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రహదారులు భవనాల శాఖ పరిధిలోని రోడ్ల నిర్మాణం, మరమ్మత్తుల పనులను పెద్ద ఎత్తున నిధులు విడుదల అయినట్లు ఆ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ కాంతిమతి వెల్లడించారు. జిల్లాకు చెందిన చిన్న,మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవ తీసుకొని రోడ్ల పనులపై జిల్లా అధికారులతో జరిపిన సమీక్ష అనంతరం పెండింగ్ బిల్లులు విడుదల అయినట్లు పేర్కొన్నారు. గతంలో 2020-21లో న్యూ డెవలప్ మెంట్ బ్యాంకు నిధులు రూ.221.89 కోట్లతో ఏడు పనులు ఒకే ప్యాకేజీలో మంజూరు చేశారని తెలిపారు. ఇందులో రూ.50 కోట్లకు సంబంధించి పనులను కాంట్రాక్టర్ పూర్తిచేసి ఆ బిల్లులను గతంలోనే సిఎఫ్ఎంఎస్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించామన్నారు. ఈ బిల్లులు 2023 మే నెల నుంచి పెండింగ్‌లో వున్నట్టు తెలిపారు. తాజాగా ఎన్‌డిబి పనులకు సంబంధించి రూ.50 కోట్ల బిల్లులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. దీంతోపాటు మరో రూ.10 కోట్లు ఇతర గ్రాంట్లకు సంబంధించిన పనుల బిల్లులు కూడా మంజూరైనట్లు తెలిపారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో 79.70 కిలోమీటర్ల రహదారుల మరమ్మత్తులు చేపట్టేందుకు రూ.7.64 కోట్ల పరిపాలన నిధులు విడుదలయ్యాయని ఎస్ఇ తెలిపారు.

5 నుంచి ఉల్లాస్

- జిల్లాలో లక్ష్యం 48,578 మంది
- మహిళల్లో అక్షరాస్యత పెంచేందుకే.. : కలెక్టర్

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్రప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని నవంబరు 5న జిల్లాలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఈ కార్యక్రమంపై తమ ఛాంబర్‌లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 48,578 మంది మహిళలను అక్షరాస్యులగా మార్చాలని లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. వీరిని గుర్తించేందుకు ఈనెల 24లోగా సర్వే పూర్తి చేసి, జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈనెల 29న కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి, నవంబరు 2న మండల స్థాయి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సుమారు 4,800 విటి (వాలంటీర్ టీచర్) ద్వారా వీరికి బోధన జరుగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. పొదుపు మహిళా సంఘాల్లోని చదువుకున్న వారిని విటిలుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. 15ఏళ్లు దాటి నిరక్షరాస్యులైన పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులు, కాపలాదారులు, అంగన్‌వాడీ సహాయకులు, వివిధ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న నిరక్షరాస్యులతోపాటు పారిశుధ్య కార్మికులను కూడా ఎంపిక చేసి అక్షరాస్యులుగా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, వయోజనవిద్య డిడి అల్లు సోమేశ్వర్రావు, ఎఒ సిహెచ్‌ఆర్‌సిడి లక్ష్మి, డిఎల్‌డిఒ నిర్మలాదేవి, డిఎల్‌పిఒ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశంలో.. ఎమ్మెల్యే X చైర్మన్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరస్పరం ప్రశ్నలు, సవాళ్లతో సమావేశం వేడెక్కింది. ఒకరిపై మరొకరు పైచేయి సాధించే ప్రయత్నాలతో సమావేశం ఆద్యంతం నువ్వా? నేనా?? అన్నట్లు సాగింది. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మహంతి కళ్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి హాజరయ్యారు.

తొలుత మండల వ్యవసాయాధికారి నీలిమ మాట్లాడుతూ శాఖా సంబంధిత అంశాలను సభ్యులకు వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లేవని, బయట కొంటే ఒక్కో బస్తాకు రూ. 50 నుంచి రూ.70 అదనంగా తీసుకుంటున్నారని వైస్ ఎంపిపి అల్లాడ సత్యనారాయణమూర్తి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎరువులు ఇవ్వలేదు సరికదా, అధిక ధరలను కూడా అరికట్టలేకపోతున్నారని ప్రస్తావించారు. దాంతో చైర్మన్ స్పందించి ఎందుకు అలా జరుగుతోందని ఎఒని అడిగారు. ఎరువుల ఉత్పత్తి కొరత వల్ల కొంత సర్దుబాటు చేస్తున్నామని ఎఒ సమాధానమిచ్చారు. జెడ్‌పి చైర్మన్ స్పందించి, వైసిపి హయాంలో రైతులకు కావాల్సిన ఎరువులను ఆర్‌బికెల్లో ఉంచేవారమని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుకు ఎరువు దొరక్కపోవడం విచారకరమని అన్నారు. దీంతో ఎమ్మెల్యే నాగమాధవి స్పందిస్తూ ఎరువుల కొరత ఎక్కడా లేదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడా రైతులు ఫిర్యాదులు లేవని చెప్పారు. చైర్మన్ జోక్యం చేసుకుంటూ ఎరువులు కొరతని సంబంధిత అధికారే చెప్తున్నా ఎమ్మెల్యే నమ్మడం లేదని ఎద్దేవా చేశారు.

ప్రజాప్రతినిధులకు తెలియకుండా గ్రామాల్లో పనులు ఎంపిక చేయడంపై కందివలస, వెంపడాం సర్పంచులు గణేష్, పిన్నింటి కుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. అవసరమైన పనులు మానేసి, అనుయాయుల ఇళ్లకు, తోటలకు రహదారులు మంజూరు చేయడం ఎంతవరకూ సమంజసమని సభ్యులు పిఆర్ జెఇ శ్రీనివాసరావును ప్రశ్నించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ 'మీకు ఏం కావాలో అడగండి.. అంతే తప్ప మంజూరు చేసినవి ఎందుకని అడగొద్దు!. అన్నీ మీరు చెప్పినట్లే జరగాలా? కూటమి ప్రభుత్వం.. నాయకులు లేరా? తీర్మానించిన పనులు మీకు ఇబ్బందిగా ఉంటే చెప్పండి మారుద్దాం! అంతేగాని మంజూరు చేసిన వాటికి ఆటంకం కలిగించొద్దు' అంటూ వ్యాఖ్యానించారు.

ఇంతలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పందించి సర్పంచి, ఎంపిటిసికి తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని స్పష్టంచేశారు. సర్పంచులు, ఎంపిటిసిలను డమ్మీ చేయాలన్న ఆలోచనలో ఉన్నారని, ఇది మంచి పద్ధతి కాదంటూ చురకలంటించారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలదే అధికారమని, ఉపాధి హామీ చట్టంలోనూ సర్పంచులకే ప్రాధాన్యత ఉందని, అంతే తప్ప ఇష్టం వచ్చిన వారిని పెట్టి పనులు చేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇలా ఒకరిపై మరొకరు పైచేయి సాధించే ప్రయత్నం చేశారు. విద్యుత్, రెవెన్యూ శాఖలపై చర్చించి చివరికి సమయాభావం వల్ల శాంతియుతంగా సమావేశాన్ని ముగించారు. సమావేశంలో జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, వైస్ఎంపిపిలు అల్లాడ సత్యనారాయణమూర్తి, ఎన్.సత్యనారాయణరాజు, ఎంపిటిసిలు పతివాడ అప్పలనాయుడు, సత్తిబాబు, సర్పంచులు టొంపల సీతారాం, శంకాబత్తుల సత్తిబాబు, రౌతు శ్రీరామ్మూర్తి, రౌతు స్వామినాయుడు, లంకలపల్లి గాయత్రి, ఇజ్జురోతు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాటల దాడికి దిగిన జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే నాగమాధవి

అర్హులైన ఉపాధ్యాయులకు ఓటు హక్కు

జిల్లా రెవెన్యూ అధికారి అనిత

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులందరికీ ఓటు హక్కు కల్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత కోరారు. దీనికోసం విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ సమావేశం మందిరంలో శుక్రవారం సమావేం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈ సందర్భంగా వివరించారు. నవంబర్ 6లోగా ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులను స్వీకరించాలని ఆమె సూచించారు. నవంబర్ 23 న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబర్ 30 న ఓటర్ల తుది జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. సమావేశంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ, డివిఇఒ భీమశంకర్, ఎన్నికల విభాగం సూపరిన్టెండెంట్ భాస్కరరావు, ఉపాధ్యాయ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

ఎల్ఐసి పాలసీలపై బోనస్ పెంచాలి

ఎల్ఐసి కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎల్ఐసి పాలసీలపై బోనస్ పెంచి, జిఎస్‌టిని రద్దు చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ కమిటీ సభ్యుడు బడ్డుకొండ వెంకట రమణ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం విజయనగరం బ్రాంచ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఎల్ఐసి యాజమాన్యం తిరోగమన నిర్ణయాలు తీసుకోవడం తగదని అన్నారు. కొత్త పాలసీలపై పెంచిన ప్రీమియంను తగ్గించాలని కోరారు. ముఖ్యంగా ఏజెంట్ల కమిషన్ తగ్గించడం అత్యంత దారుణమని చెప్పారు. యూనియన్ విజయనగరం బ్రాంచ్ అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ మాట్లాడుతూ అన్ని పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏజెంట్ల యూనియన్ విశాఖ డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు, విజయనగరం బ్రాంచ్ కార్యదర్శి ఇల్లాపు కృష్ణ, కోశాధికారి తుమ్మలగుంటి పవన్ కుమార్, యూనియన్ గౌరవాధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్‌టి కమిషన్ చైర్మన్

గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డివిజి

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాదైన సందర్భంగా గవర్నర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రశంసాపత్రాలు, పతకాలతో విద్యార్థులు

కంటకాపల్లి విద్యార్థులకు జాతీయ స్థాయి అవార్డులు

ప్రజాశక్తి-కొత్తవలస

కంటకాపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 మందికి జాతీయ స్థాయి డ్రాయింగ్ పోటీల్లో అవార్డులు దక్కాయి. ఈ ఏడాది జులైలో ముంబయిలో నిర్వహించిన రంగోత్సవ్ ఉత్సవాల్లో వీరంతా సత్తాచాటారు. రంభ కీర్తన (8వ తరగతి), స్టీఫెన్ పాల్, కాపుగంటి జ్యోత్స్న (9వ తరగతి), కాపుగంటి శ్రుతి (6వ తరగతి), సిమ్మ ప్రజ్వలిత (5వ తరగతి) బంగారు పతకాలు సాధించారు. ఎస్.మానస (7వ తరగతి), కె.రవికుమార్ (5వ తరగతి), సిమ్మ రోహిత్ (6వ తరగతి), బోదల యామిని (10వ తరగతి) రజత పతకాలు, వేగి మోక్షిత్ (7వ తరగతి), ఎన్.యామిని (5వ తరగతి), ముల్లు హిమవర్షిణి (8వ తరగతి) కాంస్య పతకాలు కైవశం చేసుకున్నారు. వీరికి అవార్డులతోపాటు ప్రశంసాపత్రాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు అందజేశారు.

వాలీబాల్ జట్ల ఎంపికకు పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా అండర్ 17 బాల బాలికల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుండి బాలురు 120మంది, బాలికలు 60మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ కృష్ణంరాజు, జిల్లా వాలీబాల్ బాల్ సంఘం కార్యదర్శి కెవిఎఎన్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు అనంతపురం జిల్లా హిందూపూర్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరగనున్న అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీలకు హాజరవుతారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు.

త్రోబాల్, హాకీ జట్లు ఎంపిక

స్థానిక విజ్జి స్టేడియంలో అండర్ 14,17 విభాగంలో త్రో బాల్, హాకీ జట్లు ఎంపిక జరగనుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు ఆధార్, స్టడీ సర్టిఫికెట్లు పట్టుకొని రావాలన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్ -14, 17 విభాగాల్లో బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. అండర్ -17 అథ్లెటిక్స్‌లో బాలురకు పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఎంఇఒ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భూదందాను అరికట్టాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో రైతులకు తెలియకుండా రెవెన్యూ సిబ్బంది, అధికారులు కలిసి రికార్డులు మార్ఫింగ్ చేసి, భూదందాకు పాల్పడ్డారని కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల జగన్ ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఎం చంద్రబాబునాయుడుకు ఆయన లేఖ రాశారు. ఈ సమస్యపై బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు ఎన్నిసార్లు చెప్పినా రైతుల మాట వినలేదని, అందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారు. భూ మార్ఫింగ్ దందా నుంచి రైతులను కాపాడాలని విజ్ఞప్తిచేశారు.

ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

గురుకులంలో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విజయనగరం, మన్యం జిల్లాల పరిధిలోని అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు 130 మంది ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనను డిసిఒ టిఎం ఫ్లోరెన్స్ తిలకించారు. ప్రదర్శనకు డైట్ లెక్చరర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె.వి.రమణ, ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఇ.విజయకుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎం.కృష్ణారావు, ప్రిన్సిపల్ కె.ఉషారాణి పాల్గొన్నారు.

నట్టల వ్యాధి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని పెరుమాళి, కాలంరాజుపేట గ్రామాల్లో శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణకు మందులను మండల పశు వైద్యాధికారి జె.నరేంద్రకుమార్ అందజేశారు. నట్టల వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో పెరుమాళి సర్పంచి ప్రతినిధి ఎస్.అప్పలనరసింహరాజు, కాలంరాజుపేట సర్పంచ్ రమణమూర్తి , ఎహెచ్ఎ జి.సోనియా, ఒఎస్ రాజబాబు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై అవగాహన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పంట కోత ప్రయోగంపై వ్యవసాయ సహాయకులకు అవగాహన ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ప్రాధాన్యతను వివరించారు. పంట దిగుబడులు అంచనా వేసేందుకు, పంటల బీమా రైతులకు వర్తించుటకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిఎస్ఒ మీసాల బాబు, ఎఎస్ఒ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని రామస్వామిపేట సచివాలయాన్ని శుక్రవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సమస్య ఆరా తీసి, వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేసి, నీరు అందించాలని సూచించారు. ప్రధానంగా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న గురుకులం, కెజిబివి, ఎపి మోడల్ స్కూల్‌ను శుక్రవారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారని ఆరాతీసి, పబ్లిక్ పరీక్షలకు ఎలా చదవాలో ఆయన సూచనలిచ్చారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూ పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు.

డ్వాక్రా బజారుకు ఆదరణ

- సుమారు రూ.6 కోట్ల వ్యాపారం
- 254 స్టాళ్లలో 289 మంది ఉత్పత్తులు
- ఈ నెల 20 వరకు ప్రదర్శన

డాక్రా బజారులో షాపు వద్ద కొనుగోలుదారులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరంలోని ట్యాంక్‌బండ్ రోడ్డు మాన్సాస్ స్థలంలో ఏర్పాటు చేసిన అఖిల భారత్ డ్వాక్రా బజారు జిల్లా ప్రజల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. ఈ నెల 11 నుంచి సరస్ పేరిట నిర్వహిస్తున్న ఈ బజారులో ఇంతవరకు సుమారు రూ.6 కోట్లు వ్యాపారం జరిగింది. 289 డ్వాక్రా సంఘాలు, మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను 254 స్టాళ్ల ద్వారా ఇక్కడ ప్రదర్శించడంతోపాటు విక్రయాలు సాగిస్తున్నారు.

ఎటు చూసినా ఆకర్షించే బొమ్మలు, వివిధ రకాల పచ్చళ్లు, జ్యుయలరీ వస్తువులు, అటవీ ఉత్పత్తులు, వెదురు వస్తువులు, ఏటుకొప్పాక బొమ్మలు, ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వా, కాకినాడ కాజా, హెర్బల్ ప్రొడక్ట్స్, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు ఈ ప్రదర్శనలో ఉంచారు. వివిధ రకాల అలంకార వస్తువులు, హస్తకళలు, చేనేత వస్త్రాలు, దుస్తులు తినుబండారాలతో ఈ ప్రదర్శన అన్ని వర్గాలను ఆకట్టుకుంటోంది. అంతేకాకుండా డ్వాక్రాబజారు ప్రాంగణంలో ఆహ్లాదం కలిగించేందుకు మన సంస్కృతి, సంప్రదాయాలు అందరికీ చాటిచెప్పేందుకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. స్వయం సహాయక సంఘం మహిళలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు, వారికి చేయూతనిచ్చేందుకు సరస్ పేరుతో పది రోజులపాటు ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అన్ని ఉత్పత్తులూ ఒకేచోట

పూర్తిగా ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రజలకు పరిచయం చేస్తున్నారు. తాము తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకోవడమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించే అవకాశం కలుగుతుందని మహిళలు చెబుతున్నారు. ఈ డ్వాక్రా బజారులో ముచ్చటగొలిపే అలంకరణలు, అదుర్స్ అనిపించే కాలంకారీ, కాటన్ చీరలు, పొందూరు ఖాదీ, తెలంగాణా లుంగీలు, టవల్స్, మంగళగిరి చేనేత వస్త్రాలు, కోన సీమ హెర్బల్ ప్రొడక్ట్స్, పుట్టపర్తి లెదర్ ఐటమ్స్, త్రిపుర హ్యాండ్‌లూమ్స్, ఏటుకొప్పాక బొమ్మలు, గుజరాత్ ఎంబ్రాయిడరీ దుస్తులు, వెస్ట్ బెంగాల్ నుండి వెదురు ఉత్పత్తులు, చెక్కతో తయారు చేసిన బొమ్మలు పాలకొల్లు పిండి వంటలు, మాడుగుల హల్వా, గుంటూరు పచ్చళ్లు, సీతంపేట చిరుధాన్యాలు వంటి సకల ఉత్పతులకు డ్వాక్రా బజారు వేదిక అయింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే దేశంలో మహిళలు రూపొందించిన వస్తువులన్నీ ఒకే చోట కొలువుదీరాయి. వందల రకాల ఉత్పత్తులు ఒకే చోట లభ్యం కావడం వల్ల సందర్శకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అరుదుగా దొరికే అనేక వస్తువులు ఇక్కడ స్టాళ్లలో లభిస్తున్నాయి. బయటి మార్కెట్లో ధరలతో పోలిస్తే ఇక్కడ చవకగానే వస్తువులు దొరుకుతున్నాయని సందర్శకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం షాపు ఎదుట బైఠాయించిన సిపిఎం, ఐద్వా నాయకులు, మహిళలు

మద్యం షాపు ముందు బైఠాయింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

మార్కెట్లో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపు ఎదుట ఐద్వా, సిపిఎం ఆధ్వర్యంలో మహిళలు, స్థానికులు బైఠాయించారు. మార్కెట్లో నూతన మద్యం షాపును వ్యాపారులు ఏర్పాటు చేశారు. నిత్యం జనాలతో రద్దీగా ఉండే మార్కెట్లో మద్యం షాపు పెట్టవద్దని శుక్రవారం ఐద్వా, సిపిఎం ఆధ్వర్యంలో స్థానికులు బైఠాయించి, నిరసన తెలిపారు. జనాసాల మధ్య మద్యం షాపు పెడితే మహిళలు, బాలికలకు రక్షణ ఉండదని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు కె.పుణ్యవతి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు ఆందోళన వ్యక్తంచేశారు. మద్యం షాపు వేరే చోటకు తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అన్న క్యాంటీన్‌లో నాణ్యతా లోపం

ప్రజాశక్తి-రాజాం

పట్టణంలో ఏర్పాటుచేసిన అన్న కాంటీన్‌లో భోజనం నాణ్యత లోపిస్తోంది. భోజనం బాగోలేదని, మెనూ అమలు చెయ్యడంలేదని పలువురు బహిరంగా విమర్శలు చేస్తున్నారు. క్యాంటీన్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉండటంతో పేదలు భోజనం చెయ్యడానికి నిత్యం వస్తూ ఉంటారు . అయితే భోజనం చేయడానికి వచ్చిన వారు పప్పు పలచగా ఉంటోందని, సాంబారులో నీరు కలుపుతున్నారని బహిరంగానే ఆరోపిస్తున్నారు. భోజనం సమయానికి పెట్టడం లేదని, లైన్‌లో గంటలు కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదల కోసం అన్న క్యాంటీన్ పెట్టినట్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో మెనూ పాటించడం లేదు. ఎక్కువగా సాంబారుతో సరిపెడుతున్నారని పలువురు మండిపడుతున్నారు.

రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తా

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు.. రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-దత్తిరాజేరు

రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తానని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పాపయ్యవలస, దత్తి, భోజరాజపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. దత్తిరాజేరు నుంచి దత్తి గ్రామానికి రూ.2 కోట్లతో, దత్తి నుంచి భోజరాజపురానికి రూ.2 కోట్లతో, పాపయ్యవలస గ్రామానికి రూ.కోటితో రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రాపు సురేష్, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మజ్జి మహేష్, పెద్దింటి మోహన్, బోడసింగి సత్తిబాబు, గోపాలరాజు, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : పల్లె పండగ ద్వారా ప్రగతికి అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తెలిపారు. శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గొర్లిపేటలో ఎన్.ఆర్ రోడ్డు నుంచి గొర్లిపేట మీదుగా రామతీర్థం వరకు బిటి రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, ఎం.ఎం.నాయుడు, గదల అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

తెర్లాం : తెర్లాం మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపిడిఒ ఆర్.రాంబాబు ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎపిఒ కె.సుశీల, సర్పంచ్ బి.రూప, ఎంపిటిసి ఆనంద్, టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వెంకట్ నాయుడు, ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నెల్లిమర్ల.. శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి ; తెర్లాం.. శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నాయకులు

వేపాడ : వల్లంపూడిలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్ర అంజలి, పంచాయతీ కార్యదర్శి పద్మ, టిడిపి నాయకులు సేనాపతి గణేష్, సేనాపతి సత్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతకవిటి : మండలంలోని కాకరాపల్లిలో పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ అశోక్, తెలుగు యువత మండల అధ్యక్షులు వావిలిపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారు రామకృష్ణ సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

డెంకాడ : పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అక్కివరం గ్రామంలో ఆసిరమ్మతల్లి గుడికి రోడ్డు పనులకు ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కంది సూర్యనారాయణ, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, పంచాయతీరాజ్ జెఇ పాల్గొన్నారు.

బొండపల్లి : మండలంలోని రయింద్రం, కొత్తపాలెం గ్రామాల్లో ఎంపిడిఒ జి.గిరిబాల ఆధ్వర్యాన పల్లె పండగ కార్యక్రమం జరిగింది. రయింద్రంలో సర్పంచ్ ముదునూరు శ్రీనివాసరాజు, కొత్తపాలెంలో మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎ.రఘుపతిరావు, పంచాయతీ రాజ్ ఎఇ పి.అప్పలనాయుడు, ఎపిఒ బి.కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, సన్యాసిరాజు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండలంలోని రొంపల్లి పంచాయతీలో గొల్లవీధిలో రూ.12 లక్షలతో నిర్మించనున్న సిసి కాలువ నిర్మాణానికి ఎంపిడిఒ రత్నం ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రొంపల్లి సర్పంచ్ భవిరెడ్డి పెంటమ్మ, ఎంపిటిసి సభ్యులు భవిరెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ఆర్‌డిఒ రామ్మోహనరావు

రామభద్రపురం.. రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

ప్రజాశక్తి-రామభద్రపురం

దశాబ్ద కాలం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో పేరుకుపోయిన భూసమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇట్లమామిడిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన రీసర్వేలో ఎక్కువ లోపాలు ఉన్నట్టు గుర్తించామని, వాటిని పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నదే లక్ష్యమన్నారు. ఈ సమస్యలన్నీ ఆన్‌లైన్ చేసి మూడు నెలల్లోగా సమస్యలు పరిష్కరించనున్నామని తెలిపారు. మండల స్థాయిలో ఉన్న సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తెర్లాం : భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం చేస్తాయని తహశీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నెమలాంలో గ్రామసభ నిర్వహించారు. రీ సర్వే ద్వారా జరిగిన తప్పులను సరిచేస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ ఎం.కృష్ణమూర్తి నాయుడు, డిటి రవికుమార్, మండల సర్వేయర్ సాయి, విఆర్ఒ ఎస్.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బోను అప్పలనాయుడు, సర్పంచ్ ఎం.నరసింహులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని నీలకంఠరాజుపురం అగ్రహారం సచివాలయ పరిధిలోని జమ్మాజీపేటలో తహశీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యాన గ్రామసభ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దేవి, ఎంపిటిసి వేచలపు వెంకట చినరామినాయుడు, మాజీ ఎంపిటిసి జగ్గుబాబు, పోతల రమణ, పంచాయతీ కార్యదర్శి కె.కన్నంనాయుడు పాల్గొన్నారు.

డెంకాడ : రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహశీల్దార్ వి.పద్మావతి కోరారు. మండలంలోని అమకాం పంచాయతీ చిట్టి గుంకలాంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బలస పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పినతాడివాడలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ భవాని, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-డెంకాడ

ప్రతి గ్రామంలోనూ సర్పంచులు, కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టిసారించాలని ఎంపిడిఒ భవాని కోరారు. మండలంలోని పినతాడివాడ, డెంకాడ గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. మంచినీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో పినతాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు, కార్యదర్శి దాడి వెంకటరావు, డెంకాడ కార్యదర్శి తులసి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవలస : ప్రతీ శుక్రవారం డ్రైడే పక్కాగా నిర్వహించాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు డ్రైడేను నిర్వహించారు. దేవాడ, ముసిరాం గ్రామాలలో ఆయన పర్యటించి, పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఉత్తరాపల్లి, చిన్నిపాలెం గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలను డాక్టర్ సింహాద్రి నాయుడు పరిశీలించారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యం రూ.27 కోట్లు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో ఈ ఏడాది డ్వాక్రా మహిళలకు రూ.27 కోట్లతో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయనున్నామని ఎపిఎం అన్నపూర్ణ తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే రూ.8.85 కోట్ల రుణాలు అందించామన్నారు. మిగిలిన సంఘాలకు త్వరలోనే బ్యాంకు రుణాలు అందిస్తామని తెలిపారు. స్త్రీనిధి కింద ఈ ఏడాది రూ.6 కోట్ల రుణాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రుణాలు డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సత్యవంతుడు

పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

బొద్దాం పిహెచ్‌సిలో శుక్రవారం ఎంపిపి డి.సత్యవంతుడు అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిబ్బంది సమస్యలపై ఇచ్చిన వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎంపిపి సూచనలు చేశారు. సమావేశంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, నాయకులు దుల్ల మహేష్, ఎర్ర సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

బొండపల్లి : జీడిపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. శుక్రవారం వీరికి మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలి

కమిషనర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శంకరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో పాకివీధికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. పాకివీధికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు శుక్రవారం స్థలాన్ని చదును చేయడం ప్రారంభించారు. ఈ పనులను కార్మిక కుటుంబాలు అడ్డుకున్నాయి. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఈ ఖాళీ స్థలంలో మున్సిపల్ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని గతంలో మున్సిపల్ అధికారులు, పాలకులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పట్టణంలో పారిశుధ్య పనులు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. పనులను అడ్డుకోవడంతో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ అక్కడికి చేరుకున్నారు. కార్మికులకు వారు సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా, అంగీకరించలేదు. ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో చర్చలు జరిగేంత వరకు చదును పనులు ఆపాలని కార్మికులు కోరడంతో అధికారులు అంగీకరించారు.

అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలి

టౌన్ ప్లానింగ్ అధికారుల సమావేశంలో కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అక్రమ భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులకు, సిబ్బందికి కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్దేశించిన జాబ్ చార్ట్ ప్రకారం పనిచేయాలని, ప్రతిరోజూ తప్పనిసరిగా వారికి కేటాయించిన ఏరియా నందు పర్యటించి అక్రమ కట్టడాలను ప్రారంభ దశలోనే గుర్తించాలని తెలిపారు. వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ అనుమతులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. నగరంలో వాల్ పోస్టర్లు, బ్యానర్లు నిషేధించినందున ప్రజలంతా సుందరీకరణకు సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ నుండి అనుమతి పొందిన తరువాత భవన నిర్మాణాలు చేపట్టాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో ఎసిపిలు వైవి రమణమూర్తి, ఎన్.హరిబాబు, టిపిఒ ఎన్. అప్పలరాజు, టిపిఒ సిహెచ్ అనిత, టిపి ఎస్, వార్డు ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్ సీర్స్ ఇన్‌ఛార్జులు, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నూడిల్స్ కోసం వెళ్లి మృత్యువాత

ప్రజాశక్తి-బొబ్బిలి

ఘటనా స్థలంలో మృతిచెందిన సత్యనారాయణ

కుమార్తె నూడిల్స్ అడిగిందని కొని తెచ్చేందుకు వెళ్లిన ఆ తండ్రి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన విషాదకర ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. మెట్టవలసకు చెందిన కర్రి సత్యనారాయణ(26) గ్రోత్ సెంటర్లో కళాసీగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు నుంచి ఇంటికి వెళ్లిన తండ్రిని కుమార్తె నూడిల్స్ అడగడంతో ఆమెను తీసుకుని బొబ్బిలి వెళ్లాడు. నూడిల్స్ పార్సిల్ చేసుకుని ఇంటికి వస్తుండగా రైల్వే ఫ్లై ఓవర్ డౌన్‌లో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మతి చెందగా కుమార్తె తీవ్రంగా గాయపడింది. మెట్టవలస గ్రామానికి చెందిన యువకులు జశ్వంత్, విశాల్.. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సత్యనారాయణను లిఫ్ట్ అడగడంతో లిఫ్ట్ ఇచ్చాడు. వెనుక ఉన్న ఇద్దరు యువకులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సత్యనారాయణ మరణంతో మెట్టవలసలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. సంఘటన స్థలానికి పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.